## క్లుప్తంగా

### బాధితురాలికి ఆర్థిక సాయం



వీరవేణికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్థానిక నాయకులు

**నిడదవోలు రూరల్:** పెండ్యాలలో అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం నుంచి నిత్యావసర సరకులు గురువారం అందజేశారు. ఈ నెల 27వ తేదీ విద్యుదాఘాతంతో తాటాకిల్లు దగ్ధమై నిరాశ్రయులైన వీరమల్ల వీరవేణి కుటుంబ సభ్యులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తరుపున రూ.10 వేలు ఆర్థిక సాయంతో పాటు 25 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, వంటనూనె, కూరగాయలు అందజేసినట్టు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చేకూరి వెంకట రామరాజు, జనసేన మండల అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యుడు వాకా శ్రీను, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా లక్ష బిల్వార్చన



ముక్తేశ్వరస్వామి వారికి లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

**పెరవలి:** కార్తిక మాసం బహుళ ద్వాదశి సందర్భంగా కొత్తపల్లి అగ్రహారంలో ఉమా ముక్తేశ్వర స్వామి ఆలయంలో గురువారం లక్షబిల్వార్చన పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం తదితర పూజలు, రుద్రాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీక మాసం అంటే పరమశివుడికి ఎంతో ఇష్టమైందని అందుకే స్వామి వారికి లక్షబిల్వార్చన చేశామని అర్చకులు వెలవలపల్లి సత్యనారాయణ మూర్తిని తెలిపారు. ఈ సందర్భంగా అర్చకుడిని గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. అదే గ్రామానికి చెందిన కాకర భాస్కర్ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 3 వేల మంది పాల్గొని స్వామివారి ప్రసాదాలను స్వీకరించారు.

### డీఈఎఫ్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం




డైమండ్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్(డీఈఎఫ్) ఫిల్లింగ్ స్టేషన్

**దేవరపల్లి:** వాహన కాలుష్య నియంత్రణకు డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్(డీఈఎఫ్) ఇందనాన్ని వినియోగించాలని స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. దేవరపల్లి–గోపాలపురం జాతీయరహదారిలో డైమండ్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన డీఈఎఫ్ ఫిల్లింగ్ స్టేషన్‌ను గురువారం ఎమ్మెల్యే వెంకట్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆమట్లాడుతూ బీఎస్–6, బీఎస్–4 వాహనాలకు డీఈఎఫ్ ఇందనాన్ని వాడడం వల్ల ఇంజిన్‌కు భారం తగ్గుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫిల్లింగ్ స్టేషన్ల నిర్వాహకులు బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో డీఈఎఫ్ ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి. సువర్ణరాజు, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు సుంకర దుర్గారావు, బందపురం సర్పంచ్ కాట్రగడ్డ గాంధీ, ఫిల్లింగ్ స్టేషన్ ప్రతినిధులు యలమంచిలి సుధీర్‌బాబు, నెక్కల వెంకట్, వలవల నవీన్, జరబన సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి



తాళ్లపూడి మండల పరిషత్‌కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న వలంటీర్లు

**తాళ్లపూడి:** నిరంతరం సేవాభావంతో పనిచేసిన తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పలువురు గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని సచివాలయాల్లో గత ప్రభుత్వంలో పని చేసిన పలువురు వలంటీర్లు కార్యాలయ సూపరింటెండెంట్ నిర్మలకుమారికి తమను విధుల్లోకి తీసుకోవాలని వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల రూ.10 వేలు గౌరవ వేతనం చెల్లించి విధుల్లోకి తీసుకోవాలన్నారు. తద్వారా తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.60 లక్షల మంది కుటుంబాల ఆర్థిక సమస్యలను పరిగణంలోకి తీసుకుని గత ఐదు నెలలుగా బకాయి పడ్డ గౌరవ వేతనాం చెల్లించి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు అయ్యప్ప, భవాని, పద్మ, కృష్ణకుమారి, అనూష, జయదుర్గ, స్వర్ణకుమారి, విల్లు తదితరులు పాల్గొన్నారు.

# తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు రెడ్ సిగ్నల్

- మూలకు చేరిన 102 వాహనాలు
- బిల్లులు చెల్లించక ఇబ్బంది పడుతున్న సిబ్బంది
- అంతంత మాత్రంగా ఆసుపత్రుల్లో తల్లీబిడ్డ సేవలు

**నల్లజర్ల :** పసిబిడ్డను ఎత్తుకొని ఇంటికి క్షేమంగా వెళ్లేందుకు ఎలాంటి ప్రయాసలు పడనవసరం లేకుండా గత ప్రభుత్వం అన్ని ఆసుపత్రుల ద్వారా ప్రసూతి సేవలు అందించడంతోపాటు ప్రసవానంతరం కూడా మాతా, శిశువులకు 102 వాహనాలలో పైసా ఖర్చు లేకుండా ఇంటికి చేర వేసే ఏర్పాటు చేసింది. వేసవి నేపథ్యంలో ఎండవేడిమి తగలకుండా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ సౌకర్యం కూడా కల్పించారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఈ వాహనాలన్నీ మూలకు చేరాయి. గత ప్రభుత్వ హయాంలో 102 సేవలు ఎంతో మెరుగ్గా ఉండేవని ప్రజలు చెబుతున్నారు.

**సమర్థవంతంగా సేవలు**

తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 33 వాహనాలు కేటాయించారు. 72 మంది డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు. కొవ్వూరు డివిజన్‌లో 15 వాహనాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అరబిందో ఎమర్జన్సీ మెడికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నారు. జిల్లాలో ప్రధాన ఆసుపత్రుల వద్ద వీటిని అందుబాటులో ఉంచారు. ఆసుపత్రుల్లో ప్రసూతి సేవలు పొంది డిశ్చార్జి వివరాలు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బందికి అందిచేవారు. ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో సమస్త సమాచారం ఉంటుంది. ఆసుపత్రి నుంచి బయలుదేరిన మొదలు ఇంటి దగ్గర వదిలే వరకూ తల్లీబిడ్డ ఫొటోలు ఈయాప్‌లో అప్‌లోడ్ చేసే వారు. ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగిన తర్వాత వారి వివరాలు యాప్‌లో చేరిన వెంటనే ప్రభుత్వం ఆదేశం మేరకు తల్లీబిడ్లను వారి స్వగ్రామాలకు చేర్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు కుంటుపడుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం అయిన బాలింతలు, శిశువులను పట్టించుకునేవారు లేరు. 102 వాహన డ్రైవర్లకు జీతాలు లేవు. అరకొర డీజిల్‌తో సాగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కొన్ని వాహనాలు మూలకు చేరాయి.

పొత్తిళ్లలో బిడ్డను పట్టుకున్న తల్లికి అది ఎంతో అపురూపం. ప్రసవం అనంతరం బిడ్డను మురిపెంగా చూసుకునే క్షణాలు ఇంకా అపూర్వం. బాలింతలకు అత్యంత కీలకమైన ఈ ఘడియలలో ఇసుమంతైనా ఇబ్బంది కలుగకుండా గత ప్రభుత్వం వినూత్న రీతిలో ఏర్పాటు చేసింది. అమ్మగా మారిన అతివ తన బిడ్డతోపాటు ఇంటికి సురక్షితంగా చేర్చేందుకు సకల సదుపాయాలతో కూడిన వాహనాలను అందుబాటులో ఉంచింది. ప్రభుత్వం ఇచ్చిన ఈ బాధ్యతను 102 సిబ్బంది కూడా అంతే బాధ్యతతో నిర్వర్తిస్తున్నారు. ఇది గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మాట. కానీ ఇప్పటి ప్రభుత్వం ఆ సేవలను పట్టించుకోవడం మానేసింది. దీంతో వాహనాలు మూలకు చేరాయి. 2022 ఏప్రిల్ ఒకటిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అయితే ప్రస్తుతం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు కుంటుపడుతున్నాయని, కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజానీకం దుమ్మెత్తి పోస్తోంది.



బిడ్డతో సురక్షితంగా ఇంటికి చేరిన బాలింత



నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం

**జీతాలు ఇవ్వకపోతే ఎలా..**



నాలుగు నెలలుగా డ్రైవర్లు, డెటా ఎంట్రీ ఆపరేటర్లకు జీతాలు లేవు. ఇబ్బంది పడుతున్నాం. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండగా ఈ పరిస్థితి లేదు. బాలింతలను సురక్షితంగా ఇంటికి చేర్చే వాహన సేవలపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. తక్షణమే వాహనాలను కండిషన్‌లో పెట్టడంతోపాటు జీతం బకాయిలు చెల్లించాలి.

– **లక్ష్మణరావు**, జిల్లా 102 వాహన సిబ్బంది సంఘ అధ్యక్షుడు, రాజమహేంద్రవరం

**ఎన్ని సమస్యలో..**



జిల్లాలో 33 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలున్నాయి.72 మంది డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు. వాహనాలకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్‌లు లేవు. ప్రమాదాలు జరిగితే ఎవరిది బాధ్యత. ఎప్పుడో వచ్చిన వాహనాలకు మరమ్మతు లేవు. టైర్లు బాగోలేవు. డ్రైవర్లకు ఇంక్రిమెంట్లు లేవు. పీఎఫ్ ఒన్‌సైడ్ కటింగ్ ఉండాలి. రెండు వైపుల కటింగ్ చేస్తున్నారు. వాహనాలు అరకొర డీజిల్‌తో సాగాల్సిన దుస్థితి నెలకొంది. అన్ని సమస్యలే.. ఇన్ని సమస్యలతో ఎలా నడిపేది.

– **శివాజీ**, డ్రైవర్, నల్లజర్ల

### కుమారదేవంలో పశువైద్య శిబిరం



పాడి రైతులకు మినరల్ మిక్చర్ దాణా అందజేస్తున్న శ్రీనివాసరావు

**కొవ్వూరు:** పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కుమారదేవం గ్రామంలో పశు వైద్యశాల వద్ద శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 95 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందజేశారు. 40 లేగ దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. మరో 110 పశువులకు బాహ్యాపరన్న జీవుల నిమిత్తం స్ప్రేయర్ చేశారు. జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి టి.శ్రీనివాసరావు చేతుల మీదుగా రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. కొవ్వూరు ఉప సంచాలకులు ఎస్.సత్యనారాయణ, డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ జేసురత్నం, కొవ్వూరు ఏరియా ఆసుపత్రి సహాయ సంచాలకులు డాక్టర్ ఎ.వెంకటరెడ్డి, పశువైద్యులు డాక్టర్ బి.గిరీష్, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ డి.రమణ, వైద్యులు యు.ముఖేష్ బాలాజీ శంకర్, సోమశేఖర్, మోహన్‌రావు తదితరులు వైద్య సేవలందించారు.

### రేపు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

**కొవ్వూరు:** స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో పట్టణంలో ప్రజా సమస్యలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. సభ్యులంతా విధిగా హాజరు కావాలని కోరారు.

## గోదావరి మంచినీటి సరఫరాను పునరుద్ధరించండి

- ఎమ్మెల్యే మద్దిపాటికి భాస్కరరావు వినతి
- కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**దేవరపల్లి:** సత్యసాయి మంచినీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న గోదావరి మంచినీటి సరఫరాను పునరుద్ధరించి, దివ్యాగులు, వృద్ధుల దాహాన్ని తీర్చాలని గొల్లగూడెం వద్ద గల భారతి దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపకులు కాగిత భాస్కరరావు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును కోరారు. లగడపాటి రామలక్ష్మమ్మ రామానాయుడు దివ్యాగుల, వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగుడికి కృత్రిమ కాలును అమర్చి నడిపించారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఆశ్రమం నిర్వహిస్తూ ఎంతో మంది అనాథ దివ్యాగులు, వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న కాగిత భాస్కరరావును ఆయన అభినందించారు. ఆశ్రమంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. వ్యవస్థాపకుడు కాగిత భాస్కరరావు మాట్లాడుతూ 2012లో అప్పటి ఎమ్మెల్యే తానేటి వనిత ఆశ్రమానికి సత్యసాయి మంచినీటి పథకం ద్వారా పైపులైన్లు ఏర్పాటు చేసి ట్యాంకు నిర్మాణం చేశారని, రోడ్డు విస్తీరణలో భాగంగా పైపులైన్ పాడైపోయిందన్నారు. దీని వల్ల గత ఐదేళ్లగా మంచినీరు సరఫరా లేదని, గోపాలపురం, దేవరపల్లి గ్రామాల నుంచి టిన్నుల ద్వారా తెచ్చుకొంటున్నట్టు ఆయన తెలిపారు. మంచినీటి సరఫరాను పునరుద్దరించి, సిమెంట్ రోడ్డు నిర్మాణం చేయాలని ఆయన కోరారు. దివ్యాగులకు అవసరమైన అన్ని రకాల పరికరాలు అందజేయనున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, సర్పంచ్ కాట్రగడ్డ పరమేశ్వరరావు, కృత్రిమ అవయవాల కేంద్రం నిర్వాహకుడు కె.రత్నకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లగూడెం ఆశ్రమంలో దివ్యాంగుడికి అమర్చిన కృత్రిమ కాలును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోండి

**చాగల్లు:** రానున్న తుపానును దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. ఊనగట్ల సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. రైతులు పొలాల్లో ధాన్యం సకాలంలో రైసు మిల్లులు చేర్చే విధంగా సంబంధిత అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.మెరికమ్మ, వ్యవసాయ అధికారి కె.వేణుగోపాలకృష్ణ, పౌరసరఫరాల డిప్యూటీ తహసిల్దార్ కె.సునీత, ఆర్ఐ షేక్ కమాల్‌పాల్గొన్నారు.

**ఆరబెట్టిన ధాన్యం మిల్లులకు తరలించాలి**

**నల్లజర్ల:** తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందునా వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని, ఆరు బయట ఆరబెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు గానీ రైస్ మిల్లులకు తరలించాలని తహసీల్దారు కృష్ణారావు, మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ రైతులకు సూచించారు. రైతులంతా అప్రమత్తంగా ఉండాలని పండించిన పంటను కాపాడుకోవాలని సూచించారు. మండలంలో 8,343,ఎకరాలకు గాను ఇంత వరకు 4,023 ఎకరాలలో వరి కోతలు పూర్తయ్యాయని, 5425 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసినట్టు వ్యవసాయాధికారి తెలిపారు.189.7 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని షెడ్యూలు ఇచ్చినట్టు తెలిపారు. రైతు సేవా కేంద్రసిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటారని వారిని సంప్రందించి ధాన్యం పాడవకుండా మిల్లులకు తరలించాలన్నారు. ఆయా గ్రామాల్లో వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు రైతులకు సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.



ఊనగట్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత



అనంతపల్లిలో రహదారులపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు

## విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**నిడదవోలు రూరల్:** మండలంలోని కాటకోటేశ్వరం, పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని పందలపర్రు, డి.ముప్పవరం, జీడిగుంట, కలవచర్ల, కంసాలిపాలెం గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా 29వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

**దేవరపల్లి మండలంలో**

**దేవరపల్లి:** మండలంలోని యర్నగూడెం, చిన్నాయగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగిసన్తున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్. నారాయణఅప్పారావు తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన తెలిపారు. దేవరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ తెలిపారు. 11 కేవీ బందపురం ఇండస్ట్రీయల్ ఫీడర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

**కొవ్వూరు మండలంలో..**

**కొవ్వూరు:** కుమారదేవం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని నిడదవోలు విద్యుత్ శాఖ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా కుమారదేవం లోకల్ 11కేవీ, ఏజీఎల్ 11కేవీ లైన్‌లతోపాటు పెనకనమెట్ట, ఆరికిరేవుల వ్యవసాయ సర్వీసులకు ఫీడర్‌లకు సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు.

**ఉండ్రాజవరంలో..**

**ఉండ్రాజవరం:** స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో తాడిపర్రు గ్రామంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఈఈ తెలిపారు.

### కారు లారీ ఢీ: తప్పిన పెను ప్రమాదం



నల్లాకులవారిపాలెం వద్ద కారును ఢీకొన్న లారీ

**పెరవలి:** నల్లాకులవారిపాలెం వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం కారును లారీ ఢీకొన్న సంఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. రావులపాలెం నుంచి తణుకు వెళుతున్న కారు అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ పక్కకు ఆపేందుకు సైడ్ చేయగా రెండు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు రావడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని కేసు వద్దని కారులో ఉన్న వారు చెప్పడంతో వారు వెళ్లిపోయారు.

## మంచి నాయకుడిని కోల్పోయాం

- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

**పెరవలి:** పార్టీ నాయకుడిని కోల్పోయింది, తనకు అండపోయింది, స్నేహితుడిగా ఉండి తన గెలుపు కోసం విశేష కృషి చేసిన జక్కంశెట్టి రాజేంద్ర ప్రసాద్ ఇక లేరనే విషయాన్ని తట్టుకోలేకపోతున్నా అంటూ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. పెరవలిలో జక్కంశెట్టి రాజేంద్ర ప్రసాద్ మృతికి సంతాపం తెలిపి, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. 2024 ఎన్నికల్లో తణుకు నియోజక వర్గ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టి తన గెలుపు కోసం విశేషంగా కృషి చేసారని ఈయన లేని లోటు పార్టీకి, శెట్టిబలిజ కులానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగర్తి వెంకట కృష్ణారావు, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.



పెరవలిలో రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి నాగేశ్వరరావు

## సాబ్జి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా

- పీడీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపి మూర్తి

**నల్లజర్ల:** దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని, ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని పీడీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి వెల్లడించారు. బుధవారం దూబచర్ల, నల్లజర్ల, అనంతపల్లి ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి తనను బలపర్చాలని గోపిమూర్తి కోరారు. ప్రభుత్వం రెసిడెన్షియల్ విధానంలో ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ ఏ విధంగాను ఉపయోగపడడం లేదని, ఇది వారి ప్రాణాలతో చెలగాటం ఆడినట్టుగా ఉందన్నారు. ఈ విధానం వరల్డ్ బ్యాంకు నుంచి నిధులు సమకూర్చేలా ఉందన్నారు. విజయనగరం జిల్లాలో ఉపాధ్యాయ శిక్షణలో మృతి చెందిన శ్రీనివాస్, అగిరిపల్లిలో గతంలో జరిగిన శిక్షణలో మృతి చెందిన విజయకుమార్‌లకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు పి.జయకర్, జిల్లా కార్యదర్శి మనోహరకుమార్, మండలశాఖ అధ్యక్షులు పక్రుద్దీన్ ఆలీ అహమ్మద్ ,జిల్లా మాజీ కార్యదర్శి ఐవీ సత్యం ఉన్నారు.



నల్లజర్లలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీడీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి

# సమ సమాజ స్థాపనకు పూలే కృషి

- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

**కొవ్వూరు:** సమ సమాజ స్థాపన కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, నాయకులు బత్తి నాగరాజు, ఉప్పులూరి సూరిబాబు, చాగల్లు మండల పార్టీ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వ రరావు, దేవగుప్తాపు లక్ష్మణరావు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి గంధం శేషసాయి,పిట్టా శ్రీనివాస్,జుట్టా ఏడుకొండలు, బోడపాటి హనుమంతరావు, పాకా మోహన్‌రావు, డి.సూరిబాబు, మద్దిపట్ల సాయిగీత, గండి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**పేదల పెన్నిధి జ్యోతిరావు పూలే**

**పెరవలి:** మహాత్మా జ్యోతిరావు పూలే ప్రారంభించిన సత్యశోధక సమాజ్ ఉద్యమం బహుజనులకు దిశానిర్దేశాన్ని సూచించిందని బీఎస్పీ పార్టీ జిల్లా నాయకుడు గుమ్మాపు చిత్రసేన్ తెలిపారు. ముక్కామలలో బీఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చల్లాబత్తుల సత్యనారాయణ,బద్దా జాన్, చిర్రా రాజు, నల్లి రమేష్, వీరవల్లి సుబ్బారావు, వేండ్ర వీరన్న తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల ఎంపీయూపీ పాఠశాలలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు



కొవ్వూరులో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు

**మహిళలకు విద్యావకాశం కల్పించిన వ్యక్తి పూలే**

**గోపాలపురం:** మహిళలకు విద్యావకాశాన్ని కల్పించి ఉన్నత శిఖరాలు అధిరోహంచేలా ప్రోత్సహించిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. చిట్యాల ఎంపీయూపీ పాఠశాలలో గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. హెచ్‌ఎం ఇస్సాపురి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి ఎంఈఓ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏ మహేశ్వరరావు, డీఆర్‌జీలు సుబ్రహ్మణ్యం, ఫణికుమార్‌శర్మ, ఉపాధ్యాయులు గుబ్బా శ్రీనివాసరావు, సీఆర్పీ కె.నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.



ముక్కామలలో జ్యోతిరావు పూలేకు నివాళులు అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

**సామాజిక సేవలో పూలే ఆదర్శనీయులు**

**నిడదవోలు :** ప్రతి ఒక్కరికి అవసరమైన సమాన స్వేచ్ఛా హక్కును తీర్మానించిన పూలే సమాజానికి చేసిన సేవలు ఆదర్శనీయమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కారింకి నాగేశ్వరరావు, మానుపాటి లక్ష్మి, కూటమి నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డి.హరీష్, బి.యేసురత్నం, డి.రామ్మోహన్‌రావు, వెంకటరమణ, సురేష్‌కుమార్, బాలకృష్ణ, సతీష్‌కుమార్, మురళి, రామ్మోహన్‌రావు, రాజారత్నం, ఉషారాణి సునీత, జయశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### పెన్షనర్ల హర్షం

**నిడదవోలు :** ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించిన కాంపిటేషన్ రికవరీ 15 ఏళ్ళకు బదులుగా 11 నెలల మూడు నెలలకు తగ్గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై పెన్షనర్ల సంఘం నిడదవోలు శాఖ అధ్యక్షులు బలగం అప్పారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా డీఏలు, పీఆర్‌సీ, ఐఆర్ బకాయిలు కూడా మంజూరు చేయాలని వారు కోరారు.

